


# సత్యవాక్కు

# The Word of Truth

క్రైస్తవ మాసపత్రిక

JUNE - 2010

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2010 ఏప్రియల్ నెల 25,26,27 తేదీలలో గుంటూరు జిల్లా ఎండుగుంపాలెంలో యున్న క్రీస్తు సంఘము సువార్త కూటములు నిర్వహించిరి. ముప్పయి సంవత్సరముల క్రితము ఎండుగుంపాలెంలో జాషువాగూటం గారి రేడియో పరిచర్య ద్వారా అక్కడ క్రీస్తు సంఘము స్థాపించబడెను. నాటి నుండి నేటి వరకు సోదరులు జంపని సాదు డేవిడ్ గారు క్రీస్తు కొరకు నమ్మకమైన పరిచర్య చేయుచున్నారు. పలు గ్రామములలో సువార్త చాటి సాదు డేవిడ్ గారు స్థానిక సంఘములను నాటియున్నారు. పైన జరిగిన కూటములలో కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘము నుండి సోదరులు సి. హెచ్. సద్గుణరావు గారు గొప్ప వాక్య పరిచర్య చేసిరి. ముఖ్యముగా స్థానికుల కోరిక మేరకు 'బాప్తిస్మము' అను అంశమును విపులముగా బోధించిరి. కూటముల అనంతరం 4 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. యడ్లపల్లి, ఎండుగుంపాలెం, పరిసర గ్రామాల్లో జరుగుచున్న ప్రభువు పని అభివృద్ధి జెందునట్లు ప్రార్ధించ మనవి.

ఏప్రియల్ 27వ తేదీ మంగళవారం తూర్పుగోదావరిజిల్లా వీధివారిలంక గ్రామములో యున్న క్రీస్తు సంఘము చిన్న పిల్లల కొరకు బైబిలు తరగతిని నిర్వహించిరి. వీధివారిలంక, కేదార్లంక , కొత్తపేట గ్రామములనుండి 250 మందికి పైగా చిన్నపిల్లలు హాజరై దినమంతా పాటలు పాడుచు, నేర్చుకొనుచు వాక్యాన్ని వినుచు సంతోషంతో గడిపిరి. క్రొత్త అనుభూతిని పొందిరి. చిన్నపిల్లలకు ఆరోజు స్థానిక సువార్తికులు కోనాల డేవిడ్ రాజుగారు, దేవగుప్తం నుండి వచ్చిన యస్. జగజీవన్ రాజు గార్లు బైబిలు కధలు, పాటలు నేర్పించిరి.

250 మందికి పైగా హాజరైన పిల్లలతో క్రీస్తు సంఘ ఆలయం, ఆవరణ ఆత్మీయానందముతో కూడిన వాతావరణం సంతరించు కొనెను. 2వ తరగతినుండి 10వ తరగతి వరకు చదువుచున్న పిల్లలు హాజరై దేవుని గూర్చి. క్రీస్తును గూర్చి, సంఘమును గూర్చి గొప్ప సంగతులు నేర్చుకొనిరి. హాజరైన

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 30 | జూన్ - 2010 | సంచిక - 11


## క్రైస్తవుడవైన తరువాత నీవేమేమి పొందుదువు ?

( What you receive after becoming a Christian)

క్రైస్తవుడనగా క్రీస్తునందున్న వాడు. ఒకడు యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి, తన పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడు అతడు క్రైస్తవుడగును. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారని" బైబిలు చెప్పుచున్నది (గలతీ 3:27). గనుక పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందకుండా యెవడును క్రైస్తవుడు కాలేడు. అట్టివాడు సత్య వాక్యమునకు విధేయుడై తన మనస్సును పవిత్ర పరచు కొనినవాడు (1 పేతురు 1:23).

ఈనాటి మన అంశము యేమంటే ఒకడు క్రైస్తవుడైతే అతడు యేమేమి పొందును? దేవుని వాక్య ప్రకారము అతడు యేమేమి పొందునో తెలుసుకొందము:

మొదటిగా అతడు తన పాపముల నుండి విడుదల పొంది రక్షింపబడును. మారు మనస్సు పొందిన విశ్వాసి బాప్తిస్మము పొందితే యేసు ప్రభువు అతనికి రక్షణను వాగ్దానము

చేసారు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని" ఆయన చెప్పారు (మార్కు 16:16). "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" యని అపొ. పేతురు చెప్పాడు (1 పేతురు 3:21).

క్రైస్తవుడైన వాడు పాప క్షమాపణను పొందును. మారుమనస్సు వలె బాప్తిస్మము కూడా పాప క్షమాపణ నిమిత్తము, లేక పాపక్షమాపణ పొందు నిమిత్తము అవసరము. అయ్యలారా, మేమేమి చేతుము? అని పెంతుకొస్తునాడు ప్రజలు పేతురును, మిగిలిన అపొస్తలుల ను అడుగగా, "పేతురు మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని చెప్పెను (అపొ.కా. 2:37,38).

ఒకడు క్రైస్తవుడైతే అతడు పాపములనుండి కడుగబడిన వాడవు తాడు. తార్సువాడైన సౌలు ప్రభువు నందు విశ్వాసముంచి, మారుమనస్సు పొందిన స్థితిలో యుండగా, "నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్ధన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసికొనుమని" అతనికి చెప్పబడెను (అపొ.కా. 22:16). అతడు లేచి బాప్తిస్మము పొందెను (అపొ. కా. 9:18). యేసుప్రభువు సంఘమును ప్రేమించి అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువ బెట్టు కొనవలెనని వాక్యముతో ఉదకస్నానము చేత దానిని పవిత్రపరచి పరిశుద్ధ పరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను (ఎఫెసీ 5:27). మానవుని పాపములను కడిగి పవిత్ర పరచేశక్తి క్రీస్తు రక్తములో మాత్రమే యున్నది (ప్రక 1:6).

ఒకడు క్రైస్తవుడైతే పరిశు ద్ధాత్మయను వరమును పొందుతాడు. మారు మనస్సు పొందిన విశ్వాసి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందితే పరిశుద్ధాత్మయను వరము అతనికి వాగ్ధానము చేయబడింది (అపొ.కా. 2:38). యిది అద్భుతాలు, సూచక క్రియలు చేసేవరము కాదు. గాని క్రైస్తవుడైన వానిలో వాక్యము ద్వారా పరిశు ద్ధాత్ముడు నివసించును. అందుకే "మీదేహములు దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశు ద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? "యని అపొ. పౌలు ప్రశ్నించుచున్నాడు(1కొరింధీ 6:19). పరిశుద్ధాత్మ మనలో యుంటే మనం

ఆయాత్మ ఫలములను ఫలింతుము "అయితే ఆత్మ ఫలమేమనగా ప్రేమ, సంతోషము సమాధానము, దీర్ఘశాంతము దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, ఆశానిగ్రహము, ఇట్టి వాటికి విరోధమైన నియమము ఏదియు లేదు" (గలతీ 5:22-23).

తరువాత, ఒకడు క్రైస్తవుడైతే పాపమునుండి స్వాతంత్ర్యము పొందును. "పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని" యేసు ప్రభువు పలికెను (యోహాను 8:34). మద్యపానమునకు అలవాటు పడినవాడు దానికి బానిసే. చుట్ట, బీడి, సిగరెట్లను సేవించువారు వాటికీ బానిసలే. బూతులు, అబద్ధము లాడువారు వాటికి బానిసలే, వ్యభిచరించువారు దానికి బానిసలే, పాపము చేయు ప్రతివాడు పాపమునకు బానిసయే. అయితే ఒకడు సత్యమును గ్రహించిన యెడల అతడు స్వతంత్రుడగును. "మీరు క్షయ బీజమునుండి కాక శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యమూలముగా అక్షయ బీజమునుండి పుట్టింపబడిన వారు గనుక నిష్కపటమైన సహోదర ప్రేమ కలుగునట్లు మీరు సత్యమునకు విధేయులవుటచేత మీ మనస్సులను పవిత్ర పరచుకొనిన వారై యుండి, యొకనినొకడు హృదయ పూర్వకముగాను, మిక్కుటముగాను ప్రేమించుడి" (1 పేతురు 1:23). ఒకడు మారు మనస్సు నొందినపుడు తన గత పాప జీవితమును సమాధి చేసి, క్రీస్తు రక్తము వలన కడుగబడిన వాడై నూతన సృష్టిగ నీటి సమాధి నుండి తిరిగిలేచును (రోమా 6:3,4).

మరల ఒకడు క్రైస్తవుడైన తరువాత సంతోషమును, ఆనందమును పొందును ఐతియొపీయ నపుంసకుడు త్రోవలో తన రథములో ప్రయాణము చేయుచుండగా క్రీస్తు సువార్తను ఫిలిప్పు అను సువార్తికుని ద్వారా వినెను. క్రీస్తునందు విశ్వసించి, నీళ్లున్న యొక చోటికి వచ్చినప్పుడు "ఇదిగో నీళ్లు నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంక మేమని" అడిగి రథము నిలుపుమని అడిగెను. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్లలో నుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను. నపుంసకుడు క్రైస్తవుడైనందున సంతోషించెను. పెంతెకొస్తు నాడు క్రైస్తవులైన ఇంచుమించు మూడు వేలమంది సంతోషముతో యుండిరి. "వారేక మనస్కులై ప్రతి దినము దేవాల యములో తప్పక కూడు కొనుచు ఇంటింట రొట్టె విరుచుచు, దేవునిస్తుతించుచు, ప్రజలందరి వలన దయపొందిన వారై, ఆనందముతోను నిష్కపటమైన హృదయ ముతోను ఆహారము పుచ్చుకొనుచుండిరి, మరియు ప్రభువు

రక్షణపొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను" (అపొ.కా. 2:46,47).

ఒకడు క్రైస్తవుడైన యెడల అతడు రక్షణను, పాపక్షమాపణను, పాపముల నుండి విమోచింపబడి పవిత్రపరచ బడుటను, పరిశుద్ధాత్మయను వరమును, పాపములనుండి విడుదలను, సంతోషము ను పొందును. క్రీస్తు యేసునందు విశ్వాసి కాని వానికి ఈ యాత్మీయ అశీర్వా దములు చెందవు. గనుక నీవు యేసు ప్రభువునందు విశ్వాసముంచుము, ఆయనే దేవుని కుమారుడని నమ్ముము, నీ పాపముల విషయమై మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది క్రైస్తవుడవు కమ్ము. ప్రభువే తన సంఘముతో నిన్ను చేర్చును !!

**క్రైస్తవ రుజువులు**

# ఆదిమ క్రైస్తవ దస్తావేజులు
## (Early Christian Documents)

ఇప్పటివరకు యూదుల యొక్కయు రోమీయులు యొక్కయు చరిత్రలో క్రీస్తు యొక్క ప్రభావమును కూడ గమనించాము. ఈ పాఠంలో ఆదిమ క్రైస్తవుల వ్రాతలను గమనిస్తు మొదటి మూడు శతాబ్ధములలో యున్న క్రైస్తవులు క్రీస్తును గూర్చి ఎట్టి అభిప్రాయమును కలిగియుండిరో గమనిం చుదాం.

**రోమాలో యున్న క్లెమెంతు:**

క్రీ॥శ 30లో క్లెమెంతు జన్మించాడు. అతడు అపోస్తలుల సమకాలికుడు. అతడు క్రీ॥శ 92-100 సంవత్సరములలో రోమా పట్టణ బిషప్పుగా యుండి 95 సం॥లో కొరింధీయులకు ఒక పత్రిక వ్రాసెను. అతడు ఫిలిప్పీ 4:3లో చెప్పబడిన క్లెమెంతు అని కొందరు పండితులు భావిస్తారు.

ఈ క్లెమెంతు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 32వ అధ్యాయములో ఇట్లు వ్రాసాడు : "యాకోబు తన సహోదరుని కారణము వలన నమ్రతతో తన స్వంత దేశమును వీడి లాబాను యొద్దకు చేరి అతనికి పరిచర్య చేసెను. అతనికి ఇశ్రాయేలీ యుల 12 గోత్రముల రాజదండము ఇయ్యబడెను.... అతని నుండియే మన ప్రభువైన యేసుక్రీస్తు కూడ శరీర రీతిగా ఉద్భవించెను".

24వ అధ్యాయములో క్లెమెంతు ఇట్లు వ్రాసాడు : "ప్రియులారా, భవిష్యత్ పునరుత్థానముండునని మన ప్రభువు నిరంతరము ఎట్లు నిరూపించుచున్నారో గమనింతము. మన ప్రభువైన

యేసుక్రీస్తును మృతులలో నుండి లేపుట ద్వారా ప్రథమ ఫలముగా ఆయన నర్పించెను".

బైబిలు ముగింపు జరిగిన తరువాత సంఘనాయకుడొకడు వ్రాసిన ఆరంభదశ వ్రాతయిది. యేసు శారీరకంగా యాకోబు సంతతి నుండి ఉద్భవించారనీ, మనము కూడ మృతుల పునరుత్థానము పొందుదుమని నిరూపించుట కొరకు దేవుడు యేసుక్రీస్తును మృతులలోనుండి లేపారని అది చెప్పుచున్నది.

ఇగ్నేషియస్ :

సిరియాలో యున్న అంతియొకయులో ఇగ్నేషియస్ క్రీ॥శ 107 –110 సం॥లో బిషప్పుగా యుండెను. అతడు వ్రాసిన ఏడు పత్రికలు ఆదిమ క్రైస్తవ వ్రాతలలో చాల ప్రాముఖ్యమైనవి. క్రీ॥శ 117సం॥లో అతడు ట్రాజన్ చక్రవర్తిచే సింహములకు ఆహారముగా రోమీయుల క్రీడా ప్రాంగణములో పడవేయబడెను.

అతడు వ్రాసిన పత్రికలలో యేసుయొక్క దైవత్వాన్ని మానవత్వాన్ని కూడ అతడు వక్కాణించెను. చంపబడుటకు అతడు రోమా కొనిపోబడుచుండగా ఒక ఉత్తరము వ్రాసాడు. అందులో యేసుయొక్క జననం, మరణం సమాధి పునరుత్థాన ములు వాస్తవములని ప్రకటించాడు.

"మన ప్రభువైన యేసుక్రీస్తు దావీదు సంతతి వాడై యుండి దేవుని సంకల్ప ప్రకారము పరిశుద్ధాత్మని వలన మరియ గర్భములో ఉద్భవించెను. ఆయన జన్మించెను. తన కాంక్ష వలన నీటిని పవిత్రపరచునట్లు బాప్తిస్మము పొందెను" అని అతడు ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 18వ అధ్యాయములో వ్రాసాడు.

"దావీదు సంతతివాడైన యేసుక్రీస్తు, మరియు కుమారుడై నిశ్చయముగా జన్మించెను. ఆయన అన్నపానములు పుచ్చుకొనెను. పొంతి పిలాతు వలన నిశ్చయముగా హింసింపబడెను. భూమ్యాకాశముల సాక్షిగా సిలువవేయబడి మృతినొందెను. మరియు ఆయన నిశ్చయముగా తన పరలోక తండ్రిచేత మృతులలో నుండి లేపబడెను. మరియు ఆయన యందు విశ్వాసముంచిన మనలను కూడ ఆయన లేపును" (ట్రాలియన్స్)

ఇగ్నేషియస్ ఇంకా ఇట్లు వ్రాసాడు :" ఆయన శరీరమును బట్టియు శక్తిని బట్టియు దేవుని కుమారుడు. నిశ్చయముగా కన్యకు జన్మించెను. నీతియావత్తు నెరవేర్చబడునట్లు యోహానుచే బాప్తిస్మము పొందెను. చతుర్ధాధిపతియైన హేరోదు వలనను పొంతి పిలాతువలనను మన కొరకు శరీరములో నిశ్చయముగా మేకులతో సిలువకు కొట్టబడెను. ఆయన పునరుత్థానమును బట్టి అన్ని తరముల వారికి

గురుతునిచ్చెను. ఆయన పునరుత్థానము తరువాత శరీరముతో యుండెను. దీనిని నేనెరుగుదును, నమ్ముదును. ఆయన పేతురుకు అతనితోయున్న వారికి కనబడినప్పుడు, "మీరు నన్ను ముట్టుకొని చూడుడి; శరీరములేని భూతమును కాదు" అని వారికి చెప్పెను. వెంటనే వారయనను ముట్టుకొనిరి. ఆయన రక్తమాంసములను బట్టి వారాయనను హత్తుకొనియుండిరి, విశ్వసించిరి. అందువలననే వారు మరణమును సయితము లెక్కచేయలేదు గాని మరణానికి అతీతులైరి. తిరిగిలేచిన తరువాత ఆయన వారితో కలిసి భోజనం చేసారు, పానము చేసారు" (స్మర్నియన్స్).

ఇగ్నేషియస్ (క్రీ॥శ 110-115)లో మెగ్నీషియనులకు అతడు పంపిన ఉత్తరంలో ఇట్లు వ్రాసాడు : "మన నిరీక్షణయైన యేసు యొక్క జననము, శ్రమలు, పునరుత్థానములు యదార్థములు. అవి గవర్నయిన పొంతి పిలాతు కాలములో సంభవించెను.

యేసు రక్తమాంసములు గల వ్యక్తికాదని ఒక గుంపువారు చేసే దుష్ట ప్రచారమును త్రిప్పికొట్టుటకు ఇగ్నేషియస్ చాలా వ్రాసాడు. ఇగ్నేషియస్ వ్రాసిన సంగతులు ఆధునిక విమర్శకులకు కూడ జవాబుగా యున్నది. ఇగ్నేషియస్ యొక్క పత్రికలను బట్టి రెండవ శతాబ్దపు ఆరంభములో యున్న క్రైస్తవులు యేసుక్రీస్తు పరిపూర్ణమానవుడు, పరిపూర్ణ దేవుడని విశ్వసించినట్లు తెలియనగును.

**ఏరిస్టయిడ్స్:**

ఏరిస్టయిడ్స్ గ్రీకు వేదాంతి, క్రైస్తవుడు. క్రీ॥శ 125లో హాడ్రియన్ చక్రవర్తి ఏథెన్సును సందర్శించినప్పుడు యేసునందలి భయభక్తులను సమర్థించుచు ఒక వాదన నతడు ఆయనకు సమర్పించాడు. అతడిట్లు చెప్పాడు:

"క్రైస్తవుల మతమునకు యేసుక్రీస్తు మూలము. ఆయనే మెస్సీయ. ఆయన సర్వోన్నతుని దేవుని కుమారుడని పిలువబడ్డారు. దేవుడు పరలోకము నుండి దిగి వచ్చాడని, ఒక హెబ్రీ కన్యక ద్వారా ఆయన శరీరమును ధరించారనీ చెప్పబడింది. దేవుని కుమారుడు మానవ కుమార్తెలో జీవించారు. యిది సువార్తలలో బోధింపబడినది. అది మానవుల మధ్య ప్రకటింపబడినది. మీరు కూడ దానిని చదివితే దీనిలో యున్న శక్తిని గ్రహించగలరు. ఈ యేసు హెబ్రీయుల జాతిలో పుట్టెను. ఆయన అవతారము యొక్క ప్రయోజనమును నెరవేర్చుటకు ఆయనకు 12 మంది శిష్యులుండిరి. గాని ఆయన యూదులచే పొడవబడెను, చనిపోయెను, సమాధి చేయబడెను. మూడవ దినమున మృతులలో నుండి తిరిగి లేచెనని చెప్పబడెను. తదుపరి ఆయన

పరలోకమున కారోహణుడాయెను. అటు తరువాత ఈ 12 మంది శిష్యులు నాటి లోకమంతా ప్రకటించి ఆయన ఘనత, మహిమలను గూర్చి సాక్ష్యమిచ్చు చుండిరి. గనుక వారి వర్తమానాన్ని నేడు విశ్వసించి యున్న వారందరు క్రైస్తవులనబడుచున్నారు. వారు ప్రఖ్యాతి గాంచినవారు".

ఖ్వాడ్రేటస్ :

హేడ్రియన్ చక్రవర్తి ఏథెన్సు పురమును సందర్శించిన సందర్భములో, ఏథెన్సు యొక్క బిషప్పు ఖ్వాడ్రేటస్ క్రైస్తవుల పక్షముగా ఆయనకు విన్నవించెను. అతడు హేడ్రియన్ చక్రవర్తికి ఇట్లు వ్రాసాడు : "మన రక్షకుని యొక్క క్రియలు మీ సముఖమందు ఎల్లవేళలా యున్నాయి. అవి నిజంగా అద్భుతములు. స్వస్థత పరచబడినవారు, చనిపోయిన తిరిగి లేపబడినవారు, వారు స్వస్థత పొందినప్పుడు, తిరిగి బ్రదికిన పుడు చూచిన వారనేకు లున్నారు. వారు చాలాకాలము వరకు బ్రతికి యుండిరి. ప్రభువు ఈ లోకములో యున్నప్పుడే గాకుండ అయన ఈ లోకమును విడిచిన తరువాత కూడ వారు బ్రదికియుండిరి. వారిలో కొంతమందిలో మన కాలము వరకు యుండిరి".

ఖ్వాడ్రేటస్ వ్రాసిన దీనిని బట్టియేసుచే స్వస్థత చేయబడిన వారు, తిరిగి బ్రదికింపబడిన వారు అతని తరములో బ్రదికేయున్నారు.

జస్టిన్ మార్టిర్ అనునతడు గ్రీకు దంపతులకు క్రీ॥శ 100 సం॥లో ఫ్లావియా నియాపోలిస్ (షెకెము)లో జన్మించాడు. ఇది యూదయకు గలిలయకు మధ్యయున్నది. అతడు ఉపన్యాసములు. పద్యములు చరిత్ర, వేదాంతము మొదలగు అంశములపై విద్యనభ్యసించెను. తన ప్రశ్నలకు జవాబులను కనుగొను నిమిత్తము అతడు ఒక విద్యాపీఠము నుండి మరొక దానికి వెళ్లుచు యుండెను.

ఎఫెసులో మరణ శిక్షను ఎదుర్కొను చున్న క్రైస్తవుల విశ్వాసము, ధైర్యములను చూచి అతడు ఆశ్చర్యపడెను. వారు ప్రశాంతముగా మరణాన్ని ఎదుర్కొనేవారు. ఒకనాడు సముద్రీరమున నడుచుచుండగా అతడొక వృద్ధుడైన క్రైస్తవుని కలిసికొనెను. అతడు యేసును గూర్చి, ప్రవచనముల నెరవేర్పును గూర్చి జస్టిన్ మార్టిర్‌తో సంభాషించెను.

"వెంటనే నా యాత్మలో ఒక మంట పుట్టెను. ప్రవక్తలను గూర్చియు, క్రీస్తు యొక్క శిష్యులను గూర్చియు ప్రేమ నన్నావరించుకొనెను" అని అతడు వ్రాసాడు. అతడు క్రైస్తవుడై మొదట ఎఫెసులోను, తదుపరి రోమాలోను క్రైస్తవ వేదాంత పాఠశాలలను స్థాపించెను.

రోమా పట్టణములో జస్టిన్, క్రీజెన్స అను సందేహశీలుడగు వేదాంతితో

ప్రభువును గూర్చి తర్కించెను. అది జరిగిన వెంటనే నేరముతో అతడు బంధింపబడెను. రోమా చదుర్ధాతిపతి యెదుట విమర్శింప బడుచుండుగా అతడు క్రీస్తును నిరాకరిం చనందున అతని ఆరుగురు విద్యార్థులతో కూడ శిరచ్ఛేదనము చేయబడెను.

క్రీ॥శ 150లో అతడు టిర్ ఫో అనునతనికి ఇట్లు వ్రాసాడు. "ఆయన జన్మించిన కాలమందు అరేబియా నుండి వచ్చిన జ్ఞానులు ఆయన నారాధించిరి. వారు మొదట మీ దేశ సార్వభౌముడైన హేరోదు నొద్దకు వచ్చిరి.

"ఆయనను సిలువ వేసినవారు ఆయన కాళ్లలోను, చేతులలోను మేకులు దిగగొట్టిరి; ఆయనను సిలువవేసిన వారాయన వస్త్రములను చీటివేసి ఎవరికి వచ్చిన దానిని వారు తమ యిష్ట ప్రకారము పంచుకొనిరి. నిజానికి ప్రభువు సాయంత్రము వరకు మ్రానుమీద వ్రేలాడెను. సాయంత్రపు వేళవారయనను సమాధిచేసిరి; గాని మూడవ దినమందు ఆయన మరల తిరిగి లేచెను".

ఇంచుమించు క్రీ॥శ 150లోనే అతడు ఏంటోనియస్ పయస్ అను చక్రవర్తికి వ్రాసిన ఉత్తరములో ఇట్లు వ్రాసాడు: "యూదుల దేశములో యెరూషలేముకు 35 కోసుల దూరములో యున్న ఒక గ్రామములో యేసుక్రీస్తు జన్మించెను ; దీనిని కురేనియ సిరియ దేశమునకు అధిపతిగా యున్నప్పుడు యూదయలో వ్రాయబడిన ప్రజాసంఖ్యల రిజిస్టర్‌లో మీరు కనుగొనగలరు.

"నిజంగా ఆయన సిలువ వేయబడిన తరువాత ఆయన అనుచరు లందరు ఆయనను విడిచి పారి పోయిరి. కొందరాయనను ఎరుగననిరి. అటు తరువాత ఆయన మృతులలో నుండి లేచిన తరువాత వారి కగుపడి ప్రవక్తల గ్రంథములను వారు చదువ వలెనని వారికి బోధించెను. ఇవన్నియు జరిగి నెరవేరవలెనని అందులో వ్రాయబడెను. వారాయన పరలోకమున కారోహణమగుట చూచిరి. విశ్వసిం చిరి. అటు తరువాత ఆయన పంపిన శక్తినిబట్టి వారు ప్రతిజాతి మనుష్యుల యొద్దకు వెళ్లి ఈ సంగతులన్నియు వారికి బోధించిరి. వారు అపొస్తలులనబడిరి".

### రోమా నేల మాళిగలు (The Roman Catacombs):

రోమా పట్టణపు దిగువలో ఇంచుమించు 600 మైళ్ల నేల మాళిగలున్నాయి. వాటిలో లక్షలాది క్రైస్తవ సమాధులున్నాయి. ఈ నేల మాళిగలు రెండవ శతాబ్దము నుండి ఐదవ శతాబ్దము వరకు గోరీలవలె ఉపయోగపడ్డాయి. క్రైస్తవులు హింసింప బడుచున్న కాలములో ఈ గోరీలు వారి

రహస్య ఆరాధన స్థావరములవలె ఉపయోగపడ్డాయి.

ఈ అంతర్భూమి మాళిగల నిండా రోమా సామ్రాజ్య కాలములో జీవించిన క్రైస్తవులుచే గీయబడిన చిత్రములు, సంక్షిప్త వచనములు అనేకములన్నాయి. అవి ఆనాటి క్రైస్తవుల యొక్క ప్రగాఢ విశ్వాసానికి సాక్షిగా యున్నాయి. వాటిలో చేప యొక్క ఆకారముగా గీయబడిన చిత్రము తరచుకనబడ్తాది. గ్రీకు భాషలో చేపను Ichtus అంటారు. ఈ అక్షరాలు Iesous Christos, Theou Uios, Soter అను గ్రీకు పదములకు గురుతు. అనగా యేసుక్రీస్తు దేవుని కుమారుడు, రక్షకుడు (Jesus Christ, son of God, Saviour) అని యర్థము! నీవు ఎప్పుడైనా రోమ్ పట్టణం వెళ్లితే ఈ నేల మాళిగలను ఇప్పుడు కూడా స్వయంగా చూడవచ్చును.

## నేను సమీపమున నుండు దేవుడను మాత్రమేనా?

("Am I only a God Nearby)

నేటి లోకంలో ఆత్మీయ విషయాల్లో అనేక అబద్ధ బోధలు చేయబడుటను బట్టి మనం బైబిలును సరిగా పఠించక పోవుట వలన కలిగిన శిక్ష అదియని మనం అంగీకరించాలి. మరియు దేవుడు తన వాక్యము ద్వారా మనతో చెప్పుచున్న సంగతులను తీవ్రముగా మనం పరిగణించకపోవడం మరొక కారణం అని చెప్పుకోవాలి. ఆయన తన వాక్యం ద్వారా మనతో మాటలాడు చున్నందున ఆయన సమీపమున నుండు దేవుడని మనం తలస్తాము.

పాతనిబంధనలోని లేఖన భాగమునొక దానిని మనం ఇక్కడ జాగ్రత్తగా పఠించాలి. యెరూషలేము పతనము కాక ముందు అది ఆపట్టణ ప్రజలనుద్దేశించి చెప్పబడెను. అది నాడున్న అబద్ధ ప్రవక్తలను గూర్చి వారికున్న అసత్య నిరీక్షణను గూర్చి తెలియజేయుచున్నది.

సర్వశక్తుడైన దేవుడీలాగు చెప్పుచున్నాడు : " మీకు ప్రవచనములు ప్రకటించు ప్రవక్తల మాటలు ఆలకింపకుడి, వారు మిమ్మును భ్రమ పెట్టుదురు. వారు నన్ను తృణీకరించువారితో మీకు క్షేమము కలుగునని యెహోవా సెలవిచ్చెననియు, ఒకడు తన హృదయ మూర్ఖతచొప్పున నడువగా వానితో మీకు కీడు రాదనియు చెప్పుచు యెహోవా ఆజ్ఞలను బట్టి మాటలాడక తమకు తోచిన దర్శనమును బట్టి మాటలాడుదురు. యెహోవా మాట విని గ్రహించునట్లు ఆయన సభలో నిలుచువాడెవడు? నామాటను గ్రహించు

నట్లు దాని లక్ష్యము చేసినవాడె వడు? ఇదిగో యెహోవా యొక్క ఉగ్రతయను పెనుగాలి బయలు వెళ్లుచున్నది. అది భీకరమైన పెనుగాలి, అది దుష్టుల తలమీదికి పెళ్లున దిగును.తన కార్యములను సఫల పరచు వరకును తన హృదయాలోచనలు నెరవేర్చు వరకును యెహోవా కోపము చల్లారదు; అంత్య దినములలో ఈ సంగతిని మీరు బాగుగా గ్రహించుదురు. నేను వారితో మాటలాడ కుండినను వారు ప్రకటించెదరు. వారు నా సభలో చేరిన వారైన యెడల వారు నామాటలు నా ప్రజలకు తెలియజేతురు. దుష్ క్రియలు చేయక వారు దుర్మార్గమును విడిచి పెట్టునట్లు వారిని త్రిప్పి యుందురు, ఇదే యెహోవా వాక్కు, నేను సమీపమున నుండు దేవుడను మాత్రమేనా? దూరమున నుండు దేవుడను కానా? యెహోవా సెలవిచ్చిన మాట ఏదనగా నాకు కనబడ కుండ రహస్యస్థలములలో దాగ గల వాడెవడైన కలడా? నేను భూ మ్యాకాశముల యందంతట నున్న వాడను కానా? యిదే యెహోవా వాక్కు" (యిర్మియా 23:16-24).

దేవుని చిత్తమును వక్రీకరించు వానిని నిజంగా ఆయన ఆమోదించరు. ప్రతి తరములోను యిది సత్యము. అట్లు వక్రీకరించువారిని వెంబడించువారిని కూడ ఆయన ఆమోదించరు. దేవుని వాక్యాన్ని వక్రీకరించు వారిని వెంబడిస్తు ఆయన ఉగ్రతను ఎవడు తప్పించు కొనజాలడు. అబద్ధమును బోధించుట నాడు, నేడు, ఎల్లప్పుడు కూడ తీవ్రమైన నేరమే, అట్లు చేస్తూ మనం చాల దూరము వెళ్ల వచ్చును గాని ఆయన సమీపమున నుండు దేవుడు మాత్రమేనా?

– జేక్ కార్టర్.

**గమనిక ::**

**సత్యవాణి T.V. కార్యక్రమములను**
**ప్రతి బుధ, శుక్ర వారాల్లో సాయంత్రం 6:30 గంటలకు**
**రక్షణ ఛానల్ లోను, శనివారం సాయంత్రము 7 గంటలకు**
**UCC. ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం**
**6:00 గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.**

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే
సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను

# మొదటి సంఘము యొక్క అభివృద్ధి

## (The Growth of the First church)

"శిష్యుల సంఖ్యబహుగా విస్తరించెను" (అపొ.కా. 6:7). యెరూషలేములో స్థాపించబడిన సంఘము పెరిగే సంఘము. దాని అభివృద్ధి యొక్క సూత్రము అపొ.కా. 2:42-47 లో వ్రాయబడియున్నది. సంఘము సహవాసము కలిగియుండేది. ఒకరి నొకరు హెచ్చరించుకొనుచు, క్షేమాభివృద్ధి జెందుచు ఆరాధించేవారు, పరిచర్య చేసేవారు. సువార్త వెదజల్లేవారు.

పెంతెకొస్తు నాడున్న పేతురు, సంఘము యొక్క అభివృద్ధిని స్వయంగా ఎరిగి యుండి, తన వృద్ధాప్యములో ఒక ఉత్తరం వ్రాసాడు. వ్యక్తిగత క్రైస్తవులు మొదటి శతాబ్ధపు సంఘము యొక్క అభివృద్ధిలో ఎట్లు పాలు పొందారో తాను వ్రాసాడు : " దేవుని నానావిధమైన కృప విషయమై మంచి గృహనిర్వాహకులై యుండి, యొక్కొక్కడు కృపావరము పొందిన కొలది యొకనినొకడు ఉపచారము చేయుడి. ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించునట్లు బోధింపవలెను. ఒకడు ఉపచారము చేసిన యెడల దేవుడనుగ్రహించు సామర్ధ్యము నొంది చేయవలెను. ఇందువలన దేవుడు అన్నిటిలోను యేసు క్రీస్తు ద్వారా మహిమ పరచబడును, యుగయుగములు మహిమయు ప్రభావమును ఆయన కుండునుగాక, ఆమేన్" (1 పేతురు 4:10-11). పేతురు దిగువ సంగతులను మనకు బయలు పరచుచున్నాడు.

**ప్రతివాడు ఒక వరమును పొంది యున్నాడు :**

దేవుడు తన రాజ్యములో వినియోగించు నిమిత్తము అనుగ్రహించు సామర్ధ్యములు ఆత్మీయ వరములు. చేయుటకు ప్రతివానికి పనియుండెను. అందరికీ వున్న వరము ఒక్క టే కాదు, గాని ప్రతి వరము ప్రాముఖ్యము.

**పరిచర్య చేయుట కావరమును వినియోగించాలి:**

ప్రతి క్రైస్తవుడు ఒక దాసుడే. వరము పొందినంతమాత్రమున సరిపోదు. గర్వానికి అహంకారానికి అవి కారణం కాకూడదు. పరిచర్య చేయుటకు వాటిని వినియోగించాలి. దాసుని స్వభావము కలిగి యుంటే దేవుడే ఆవరమును అనుగ్రహించును.

**ఆవరము వినియోగించుట గృహ నిర్వాహకత్వము :**

యజమాని యొక్క పని నిమిత్తం

ఆయన పనిలో మనం గృహ నిర్వాహకులము మాత్రమే.

మనం మాట చేత గాని క్రియ చేతగాని యేమి చేసినా దేవుని వాక్య ప్రకారం ఆయన మహిమార్థమై చేయాలి. దేవుడు నీకిచ్చిన తలాంతును వినియోగించినప్పుడు సంఘాభివృద్ధి కొరకు నీవు ప్రాముఖ్యము.

సహవాసము ద్వారా సంఘము బలపడుటకు, ఆరాధన ద్వారా వ్యాప్తి జెందుటకు నీవు సహాయపడగలవు, చూచుటకు తెరవబడిన నేత్రములు, గ్రహించుటకు తెరవబడిన హృదయము, పరిచర్య చేయుటకు చాచిన చేతులు దేవుడు మనకు అనుగ్రహించును గాక !

– క్లే రెన్స్ డిలోచ్.

## ఆదిమ సంఘములో అద్భుతవరములు
## (Miraculous Gifts in the Early church )

క్రొత్త నిబంధన వ్రాయబడుచు యుండగా ఆదిమ సంఘము యొక్క చరిత్ర క్రొత్త నిబంధన లోనే మనకు కన్పడును. గనుక సంఘములు లేఖనముల వలన గాక పరిశుద్ధాత్మని అద్భుత ప్రేరణచే నడిపింపబడు సందర్భమును బట్టి మనం క్రొత్త నిబంధనను గ్రహించుకోవాలి.

క్రొత్త నిబంధనను చదువుచున్నప్పుడు ఆదిమ క్రైస్తవులు పరిశుద్ధాత్మ యొక్క అద్భుతవరములను బట్టి నడిపించబడిరని గమనించాలి. మొదటి శతాబ్ధపు సంఘములకు , క్రైస్తవులకు వర్తించిన సంగతులను నేటి సంఘాలకు క్రైస్తవులకు వర్తింపజేయుటలో కొందరు గొప్ప పొరబాటు చేయుచున్నారు. సత్యవాక్యమును సరిగవిభజింపలేక పోవుచున్నారు.

**అద్భుత వరముల ఆవశ్యకత :**

లిఖితపూర్వక మార్గదర్శి (క్రొత్త నిబంధన) లేనందున ఆదిమ సంఘము పరిశుద్ధాత్మ యొక్క నడిపింపును నేరుగా పొందిన వారి చేతులలో యుండెను. వారు ఆయాత్మ నడిపింపు చొప్పున మాటలాడిరి, పని చేసిరి. అట్టిది అవుసరమని పౌలు కుడా వివరించాడు: "పరిశుద్ధులు సంపూర్ణులగునట్లును, క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి జెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకును, ఆయన కొందరిని అపొస్తలులను గాను, కొందరిని కావరులను గాను, ఉపదేశకులుగాను నియమించెను. అందువలన మనమిక మీదట పసిపిల్లలమై యుండి మనుష్యుల మా యోపాయముల చేత వంచనతోను, తప్పుమార్గమునకు లాగు కుయుక్తితోను. గాలికి కొట్టుకొని పోవునట్లు కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు

కొట్టుకొని పోవుచు అలలచేత ఎగుర గొట్టబడిన వారమైనట్లుండక యుందము" (ఎఫెసీ 4:13–14).

ఈ యద్భుత వరములు "పూర్ణమైనది వచ్చేవరకు" యుండును (1కొరింథీ 13:10). అయితే స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణ నియమమే ఈ పూర్ణమైనది (యాకోబు 1:25). పరిశుద్ధాత్మా వేశము వలన పరిశుద్ధులకు విశ్వాసము ఒక్క మారే అప్పగింపబడెను (యూదా :3). ఆయన దైవశక్తి జీవమునకు, భక్తికి కావలసిన వాటినన్నిటిని మనకు దయ చేసెను (2 పేతురు 1:3). దైవ జనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు క్రొత్త నిబంధన సంపూర్తిగ రికార్డు చేయబడెను (2 తిమో 3:17).

మొదటి శతాబ్ధములో క్రొత్త నిబంధన లిఖించబడుచు యుండగా పరిశుద్ధాత్ముడు ఆయావరముల ద్వారా పనిచేసెను. క్రొత్త నిబంధన సంపూర్తి కాగానే ఆవరములు నిలిచిపోయెను. అందువలననే,జ్ఞానమైనను నిరర్ధక మగును....గాని పూర్ణమైనది వచ్చిన ప్పుడు పూర్ణముకానిది నిరర్ధకమగును" అని అపో. పౌలు చెప్పాడు (1కొరింథీ 13: 8–10). అద్భుతవరములు "పూర్ణముకానిది" అన్నమాట.పరిశు ద్ధాత్మావేశ లేఖనములు పూర్ణమైనవి. సమస్త సత్కార్యములు చేయుటకు క్రైస్తవుని లేఖనములు సిద్ధపరచును. జీవముకు భక్తికి కావలసినదంతా లేఖనములలో యున్నది. అందువలన అద్భుతవరముల స్థానములో మనకు లిఖిత పూర్వక వాక్యము అనుగ్రహించబడెను.

**అద్భుత వరములు**

1 కొరింథీ 12:8–10లో పరిశు ద్ధాత్ముడు అద్భుతముగా 9 రీతులుగ పనిచేసినట్లు సాధారణంగా మనకగు పడును. ఆయావరముల ద్వారా ఆయన పనిచేసిన విధానాన్ని క్రొత్త నిబంధన చదువుట ద్వారానే మనం గ్రహించుకో గలము. ఆయా అద్భుత వరములు దిగువ రీతిగా 1కొరింథీ 12వ అధ్యాయములో వర్ణించబడినవి.

**బుద్ధివాక్యము :**

యిది పరిశుద్ధాత్మా వేశము ద్వారాకలుగు జ్ఞానము. పౌలు ఇట్లు చెప్పాడు, " పరిపూర్ణులైన వారి మధ్య జ్ఞానమును బోధించుచున్నాము. అది యిాలోకజ్ఞానము కాదు... దేవుని జ్ఞానము మర్మమైనట్టుగా బోధించుచున్నాము. ఈ జ్ఞానము మరుగై యుండెను. జగదుత్పత్తికి ముందుగానే దీనిని దేవుడు తన మహిమ నిమిత్తము నియమించెను" (1 కొరింథీ 2:6–7). మానవుని రక్షణార్ధము దేవుని జ్ఞానమును గూర్చి యిది చెప్పుచున్నను, సంఘములు నడిపింపు కొరకీయబడిన ప్రత్యేక జ్ఞానము కూడ దీనిలో యున్నది, యిది నరులనుండి గాక

దేవుని నుండి కలుగు జ్ఞానము (యాకోబు 1:7).

**జ్ఞాన వాక్యము :**

సంఘములు స్థాపించి వాటిని దేవుని చిత్త ప్రకారము నడిపించగల సామర్థ్యమును గూర్చి బహుశ యిది ఇయ్యబడెను. దేవుని చిత్త ప్రకారము సంఘములు నడిపించబడాలి. "అందుచేత ఈ సంగతి వినిన నాటినుండి మేమును మీ నిమిత్తము ప్రార్థన చేయుట మానక, మీరు సంపూర్ణ జ్ఞానమును ఆత్మ సంబంధమైన వివేకము గలవారును, ఆయన చిత్తమును పూర్ణముగ గ్రహించిన వారునై......... ఆయనకు తగినట్టుగా నడుచు కొనవలెనని" అపో.పౌలు కొలస్సయులకు వ్రాసాడు (కొలస్స 1:9-10).

**ఆత్మ వలన విశ్వాసము :**

ఆదిలో సంఘము స్థాపించబడు చుండగా కలుగు శోధనలనుండి సంఘమును నడిపించుట కవుసరమైన విశ్వాసమును గూర్చి చెప్పబడినది. మరియు అసాధారణమైన అద్భుతములు జరిగించుటకు అవుసరమై యున్న అసాధారణమైన విశ్వాసము యిది (1 కొరింథీ 13:2; మత్తయి 17:20).

**స్వస్థపరచువరము :**

యిది అద్భుతరీతిగా రోగములను స్వస్థపరచే శక్తి (అపో.కా. 5:15,16; 19:11,12; 28: 8-9).

**అద్భుత కార్యములు చేయు శక్తి :**

స్వస్థపరచే వరము మాత్రమే గాక ప్రత్యేక అద్భుతములు చేయు శక్తిని గూర్చి చెప్పబడినది. అపో.కా. 5:1-11; 9:36-42; 20:7-10; 1 తిమో 1:20 మొదలైనవి.

**ప్రవచనవరము :**

అద్భుతవరములన్నిటి కంటే యిది ప్రాముఖ్యవరము. యిది సంఘ క్షేమాభివృద్ధి కొరకును, ప్రపంచ సువార్త వ్యాప్తి కొరకును వివిధములుగా ఇయ్యబడిన వరము. సంఘములకు వ్రాస్తు పౌలు "ఆత్మ సంబంధమైన వరములను ఆసక్తితో అపేక్షించుడి" యని వ్రాసాడు (1కొరింథీ 14:1). "ఏలయనగా క్షేమాభివృద్ధియు, హెచ్చరికయు ఆదరణయు కలుగునట్లు ప్రవచించువాడు మనుష్యులతో మాటలాడుచున్నాడు" (1 కొరింథీ 14:3). ఆత్మావేశము వలన మాటలాడు వరము యిది. అంటే మాటలాడే వాడు పరిశుద్ధాత్మ నడిపింపుచొప్పున మాటలాడును. అద్భుత రీతిగా మాటలాడుట నాలుగు రీతులుగ సంభవించును.

**1) బోధించుట :**

అగబు అనునతడొక క్రొత్త నిబంధన ప్రవక్త (అపో.కా. 21:10). అతడు పరిశుద్ధాత్మా వేశము వలన బోధించెను. అయితే భవిష్యత్తులో యేమి జరుగునో కూడ అతడు ప్రవచించెను. యూదాయు,

సీలయు కూడప్రవక్తలైయుండి వారు సహోదరులను ఆదరించిస్థిరపరచిరి (అపో.కా. 15:32). క్రొత్త నిబంధనలో మనకు కన్పడు - సువార్తికులందరు ఆత్మావేశ ప్రవక్తలే సువార్తికులు సంఘములు నాటు చుండగా ప్రవక్తలు సంఘములను బలపరచిరి. అట్టివారిని నేడు మనం స్థానిక సువార్తికుల మనుచున్నాము. నేటి మన స్థానిక "ప్రవక్తలు" పరిశుద్ధాత్మా వేశము వలన మాటలాడరు గాని ఆత్మావేశ లేఖనములు బోధింతురు.

2) ఉపదేశించుట :

సువార్తికుడైన ఫిలిప్పుకు కన్యకలుగా యున్న నలుగురు కుమార్తెలు ప్రవక్తలు (అపో.కా. 21:9).వారు బహిరంగ ఉపదేశకులుకాదు ఏలయనగా సంఘములో స్త్రీలు మౌనముగా యుండాలి (1కొరింథీ 14:34). వృద్ధ స్త్రీలు యౌవన స్త్రీలకు మంచి ఉపదేశము చేయువారై యుండాలని పౌలు హెచ్చరించాడు (తీతు 2:3-5). క్రొత్త నిబంధన కాలములో యున్నసంఘములో పరిశుద్ధాత్మావేశము వలన బైబిలు క్లాసులలో ఉపదేశించిన వారుండిరి, నశించిన వారికి వారు ఆత్మావేశము వలన బోధించిరి.

3) ప్రార్థన :

దేవుని చిత్త ప్రకారము ఎట్లు అభ్యర్థించాలో తెలియ చేయడానికి క్రొత్త నిబంధన లేని రోజుల్లో (1యోహాను 5:14), దేవతార్చన చేయువారిలో నుండి మార్పు జెందిన వారు దేవుని ఎట్లు అడగాలో, యేమి అడగాలో తెలియజే యునట్లు వారికి నడిపింపు అవసరము. యేసు యొక్క ఆదిమశిష్యులు భక్తిగల యూదులు. అయినను ప్రార్థన నేర్పుమని వారాయనను అడిగారు (లూకా 11:1). పరిశుద్ధాత్ముడు వచ్చినప్పుడు క్రొత్త గా క్రైస్తవులైన వారెట్లు ప్రార్థించాలో నేర్పే బాధ్యత ఆయనదే. ఆత్మ నడిపింపు చొప్పున వారి ప్రార్థనలుండేవి (ఎఫెసీ 6:18; యూదా :12 చదువుము). ఆదిమ క్రైస్తవులు భాషతో కూడ ప్రార్థన చేసేవారు (1కొరి 14:14). ఆత్మనడిపింపు చొప్పున చేసే ప్రార్థన ఆత్మతో చేసే ప్రార్థన (1కొరింథీ 14:15).

4) పాటలు పాడుట :

ఆదిమ సంఘస్థులకు కీర్తన పుస్తకాలు లేవు, గాని వారు పాడుట ద్వారా ఉపదేశించాలి (కొలస్స 3:16). గనుక పాటల ద్వారా యేమి ఉపదేశించబడినదో అదిపరిశు ద్ధాత్మ నడిపింపు చొప్పున జరిగేది. అందుకే "ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదునని" పౌలు చెప్పాడు (1కొరి 14:15).

ఆత్మల వివేచన :

మేము క్రీస్తుచే పంపబడిన

అపొస్తులులమని చెప్పుకొనే వారి ఆత్మలను పరీక్షించువరము యిది. అందుకే "ప్రియులారా అనేకులైన అబద్ధప్రవక్తలు లోకములోనికి బయలువెళ్లి యున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి"యని యోహాను హెచ్చరించాడు (1 యోహాను 4:1). లిఖిత పూర్వక లేఖనములు లేనందున ఆయా ప్రవక్తలు చెప్పేది సత్యమోకాదో ఈ యాత్మల వివేచన వరమును బట్టి నిర్ధారించబడేది. ఎఫెసులో యున్న క్రీస్తు సంఘము "అపొస్తులుల మని చెప్పుకొనువారిని పరీక్షించివారు అబద్ధికులని కనుగొనిరి" (ప్రక 2:2). అటువంటి వంచకులనేకులు ఆదిమ సంఘములోనికి బయలు వెళ్లి యున్నారు (2 యోహాను :7). అదిమ విశ్వాసులను ఈ వంచకుల యొద్ద నుండి రక్షించు నిమిత్తము, ఈ యాత్మల వివేచన వరము ఇయ్యబడెను . మన కైతే ఇప్పుడు క్రొత్త నిబంధన ఇయ్యబడి యున్నది.

**నానాభాషల వరము :**

మాటలాడువాడు తాను ఇంతకు ముందు నేర్చుకొనని భాషలో మాటలాడు వరం యిది. పరిశుద్ధాత్మ ద్వారా అన్మభాషలలో అద్భుతరీతిగా మాటలాడు వరం అవిశ్వాసులకు సూచనగా ఇయ్యబడెను (1కొరింథీ 14:22). అన్యభాషలలో మాటలాడు వరము వలన నాడున్న లోకమంతా త్వరగా సువార్త వెదజల్లబడుటకు దోహద పడినది. ఆయా దేశముల భాషలు నేర్చుకో కుండా ఈ వరము వలన సువార్తికులు వాక్యము నందించగల్గిరి.

**భాషల అర్ధము చెప్పుశక్తి :**

తాను యిది వరలో నేర్చుకోలేని భాషకు అర్ధము చెప్ప వరము యిది. అన్యభాషలలో మాటలాడు వాడు బహుశ దానికి అర్ధము చెప్పే శక్తిలేనివాడు. అందుకే "భాషతో మాటలాడు వాడు అర్ధము చెప్పుశక్తి కలుగుటకై ప్రార్ధన చేయవలెనని" పౌలు చెప్పాడు (1 కొరి 14:13). ఎవరైన అన్య ప్రాంతమునుండి వచ్చి బోధించు చున్నప్పుడు వారి ఉపదేశమును తమ భాషలోనికి తర్జుమా చేయు శక్తిగల వారి వలన స్థానిక సంఘములకు సహాయము లభించేది.

ఆదిమ సంఘములు ఆత్మయొక్క అద్భుత వరముల వలన నడిపింపబడినవి. ఆదిమ సంఘము దేవుని ఆత్మతో ఆరాధించిరి (ఫిలిప్పీ 3:3). ప్రార్ధన, పాటలు, ఉపదేశము మొదలైనవన్ని ఆత్మతో చేసిరి. క్రొత్తనిబంధన లిఖించబడిన తరువాత ఇవన్నీ సత్యవాక్యమును బట్టి జరిగించాలి. అద్భుతవరములు సమాప్తియైనవి.

– రోజర్ డిక్సన్

# పాపమును వారసత్వము వలన పొందుదుమా?
## (Do We inherit Sin today?)

బిడ్డలు ఈ లోకములో జన్మించునప్పుడు పాపముతో పుట్టుదురని నమ్మేవారు ఈనాడు అనేకులున్నారు. ఆదాము హవ్వలు చేసిన ఆదిమ పాపముతోనే పిల్లలు జన్మిస్తారని వీరి భోధ. ఈ బోధవలన పిల్లలను "ఆదిమ పాపమునుండి" రక్షించే విధానమును మానవులు కొనుగొనుట జరిగినది! అయితే ఇదంతయు బైబిలు బోధకు వ్యతిరేకమైనది. చిన్నపిల్లల పాపమును పోగొట్టుటకు గాను వారిపై నీళ్లు చిలకరించడం, ఒక్కోసారి ముంచడం కూడ జరిగిస్తూ దాన్ని బాప్తిస్మమంటారు. ఈలాగ పసిపిల్లకు బాప్తిస్మమియ్యకపోతే వారు నశించిపోతారని వారు బోధిస్తారు. అయితే లేఖనములు దీనినేమీ సమర్ధించుటలేదు.

**పాపము యొక్క అరంభము**

మానవుల అపరాధ అరంభముము గూర్చి ఆదికాండము నుండి తెలిసి కొందము. ఆదాము హవ్వలను పాపము లేకుండా దేవుడు సృజించెను. వారు ఏదెను వనములో యుంచబడిరి. కావలసినదంతయు, చివరకు జీవవృక్ష ఫలములను కూడ దేవుడు వారికి అనుగ్రహించెను. ఆ వనములో యున్న సమస్తమును వారు తినవచ్చును గాని మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలమును మాత్రము వారు తినకూడదని అజ్ఞాపింపబడిరి. వారా చెట్టు యొక్క ఫలమును తినుదినమున నిశ్చయముగా చచ్చెదరని దేవుడు వారిని హెచ్చరించెను. అయితే అపవాది సర్పము రూపమున వచ్చి హవ్వను శోధించి వారు చావనే చావరని చెప్పి మోసగించెను. అంతేగాకుండా వారు మంచి చెడ్డలను ఎరిగినవారై దేవతల వలె యుందురని దేవునికి తెలియునని చెప్పి ప్రోత్సహించెను. హవ్వ ఆ వృక్షము ఆహారమునకు మంచిదియు, కన్నులకు అందమైనదియు, వివేకమిచ్చు రమ్యమైనదియునై యుండుట చూచినప్పుడు ఆమె దాని ఫలములను తిని, తనతో పాటు తన భర్తకును ఇచ్చెను. అతడు కూడ తినెను. ఈ ఒక్క విషయములో వారు దేవునికి విధేయులై యుండాలో, అవిధేయులై యుండాలో అను నిశ్చయతను దేవుడు వారికిచ్చెను. అవిధేయులవుటకు వారు నిశ్చయించుకొనిరి. మంచి చెడుగులకు వారి కండ్లు ఇప్పుడు తెరువబడెను. వారి అంతరాత్మలు ఇప్పుడు మంచి చెడుగుల విచక్షణను గుర్తించెను. తత్ఫలితముగా వారు భయపడిరి, దేవునికి కనబడకుండా దాగుకొనుటకు ప్రయత్నించిరి. వారి దిగంబరత్వమును గూర్చి సిగ్గునెరిగిన వారై ఆకులతో తమ్మును కప్పుకొనిరి.

**పాపము యొక్క పర్యవసానము**

ఆదాము హవ్వల అవిధేయతను బట్టి దేవుడు మానవజాతికి శిక్ష విధించెను. మానవులు ఇప్పుడు మంచి చెడుగులను గుర్తించు అంతరాత్మ కలిగియున్నారు! అనేక సంగతులలో మంచి చెడ్డల నెంచుకొనే బాధ్యత ఇప్పుడు మానవునికున్నది. చెడుగును, దుష్టత్వమును ఎంచుకొనినందున అనుభవింపవలసిన పర్యవసానములు కూడ వానికున్నవి. ఇప్పటి వరకు హవ్వ గర్భము ధరించలేదు. గాని ఇప్పటినుండి ఆమె పిల్లలను కనును, మహావేదనతో ప్రసవించును. ఆదాము కూడా ఏదెనులో సమస్త సుఖములు అనుభవించుచుండెను. గాని ఇప్పటి నుండి కష్టపడి చెమటోడ్చి పనిచేయవలెను. తన కుటుంబమును పోషించవలెను. చివరిగా వారు జీవవృక్ష ఫలములు తిని చిరకాలము జీవించకుండునట్లు ఏదెను నుండి త్రోలివేయబడిరి.

**వారసత్వము వలన కాదు**

ఆదాము హవ్వలకు గాని, వారి తదనంతరము జన్మించే పిల్లలు గాని ఆదాము హవ్వల పాపమునకు వారసులని లేఖనములు ఎక్కడను బోధించుట లేదు. ఆదాము హవ్వల పాపము యొక్క పర్యవసానము మాత్రము మానవజాతిని పీడించును. ఏలయనగా వారికండ్లు ఇప్పుడు తెరువబడియున్నవి, మంచి చెడుగుల విచక్షణ ఇప్పుడు వారికున్నది మరియు జీవ వృక్ష ఫలములు వారికి అందుబాటులో లేకుండా పోయినవి.

కీర్తనలు 51:5ను బట్టి దావీదు పాపములో జన్మించినట్లు చెబుతున్నట్లు కొందరు భావిస్తారు. "నేను పాపములో పుట్టినవాడను. పాపములోనే నా తల్లి నన్ను గర్భమున ధరించెను" అని అతడు చెప్పాడు. దావీదు యొక్క తల్లి అందరి వలెనే పాపియైయుండెను. పాపిగా యున్నప్పుడు ఆమె నన్ను గర్భమున ధరించెను అని అతని యొక్క అసలైన భావము. ఎవడైనా పాపముతోనే జన్మించినట్లు చెప్పే ఆధారము దేవుని గ్రంధములో ఎక్కడా లేదు.

దావీదు యొక్క కుమారుడు మరణించగా నేనతని యొద్దకు పోదును గాని, అతడు నా యొద్దకు రాడు అని దావీదు చెప్పిన మాటలను నీ వెరిగే యుందువు. నా కుమారుడు పాపిగా చనిపోయి నరకానికి పోయాడని అతడు చెప్పుటలేదు. సరిగదా నాకుమారుడు ప్రభువు దగ్గరకు వెళ్లాడు, నేనును ఒకానొక దినమందు అక్కడకు చేరుకొందునని అతడు భావించాడు.

ఎల్లవేళలా సత్యమైన ఒక సూత్రమును యెహెజ్కేలు వ్రాసాడు : "పాపము చేయువాడే మరణము నొందును, తండ్రి యొక్క దోష శిక్షను కుమారుడు మోయుటలేదని కుమారుని దోష శిక్షను

తండ్రి మోయడు; నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును; దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:20). ఇంకో మాటలో ప్రతివాడు వాని పాపమునకు బాధ్యుడు. అంటే ఆదాము పాపము వలన గాని, మరింకొకని పాపమువలన గాని అపరాధియై ఎవడును ఈ లోకములో జన్మించుట లేదు. సరిగదా పుట్టిన ప్రతి శిశువు పవిత్రముగా, పాప రహితముగా పుట్టి, మంచి చెడుగుల విచక్షణ వయసు వచ్చువరకు ఆ స్థితిలోనే యుండును. అప్పుడు అతడు పాపము నెంచుకొని, దాన్ని జరిగించితే పాపియగును.

అయితే రోమా 3:23లో అందరును పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని పౌలు చెప్పలేదా? అది నిజమే. గాని నీవు దాని సందర్భమును గమనించితే అతడు అబద్ధములాడు వారిని గూర్చి, రక్తము చిందించు వారిని గూర్చి చెబుతున్నట్లు గ్రహించగలవు. అట్టివాటిని గూర్చి అపరాధులైన వారెవరు? అట్టి వాటిని జరిగించుటకు సరిపడినంత వయసు గలవారు, విచక్షణా జ్ఞానము గలవారు; పిన్నలు కాదు గాని పెద్దలు.

మత్తయి 18:1-5లో యేసు ప్రభువు, "మీరు మార్పునొంది బిడ్డల వంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని చెప్పెను". బిడ్డలు జన్మ పాపముతో జన్మించిన వారైతే, ఆయన శిష్యులుగాని, మరింకెవరైనా గాని బిడ్డల వంటివారు కావలెనని ఆయన చెప్పియుండకపోను.

## సువార్త పాపులకే

మనస్సాక్షి గలవారికి, విచక్షణ నెరిగిన వారికి, దేవునికి బాధ్యులైన వారికి పాపులకు సువార్తలోని రక్షణ షరతులు ఉద్దేశింపబడినవి. వారుపాపులు గనుక రక్షణ వారికి అవుసరమై యున్నది. అపోస్తలులు సర్వజనాంగములకు సువార్త బోధించ వలెనని (మత్తయి 28:19),వారు దేవుని వాక్యమును విని గ్రహించుకొన వలెనని (రోమా 10:17), దేవుని యందును, క్రీస్తునందును విశ్వసించ వలెనని (హెబ్రీ 11:6; యోహాను 14:1-3). తమ పాపముల విషయమై మారుమనస్సు పొందవలెనని (అపో.కా. 17:30), యేసే దేవుని కుమారుడని తమ నోటితో ఒప్పుకొన వలెనని (రోమా 10:10); మత్తయి 10:32,33), తమ పాపములు కడిగి వేసుకొను నిమిత్తము నీటిలో ముంచడము పొందవలెనని (అపో.కా. 2:38; 22:16) యేసు ఆజ్ఞాపించెను. ఈ బోధలు , ఆజ్ఞలు పసిపిల్లలనుద్దేశించినవి కావు. సరిగదా వినడానికి విశ్వసించడానికి, మారుమనస్సు

పొందడానికి, ఒప్పుకొనడానికి, బాప్తిస్మము పొందడానికి, యుక్త వయసు గలవారిని ఉద్దేశించినవి.

**పాప ఫలితం మరణం**

కొన్ని రోగములు వారసత్వము వలన సంక్రమించుచున్నట్లు పాపము కూడా వారసత్వము వలన సంక్రమించునను బోధ బైబిలుకు వ్యతిరేకమైనది. మానవుడు పాపము చేయగా మానవ జాతికంతటికీ దాని ఫలితము సంక్రమించెననుట వాస్తవమే. అయితే అమాయకపు పసికందులు ఆదాము హవ్వల పాపపు అపరాధముతో జన్మించుదురనుట పచ్చి అబద్ధము. ప్రతివాడు యుక్త వయస్సు వచ్చిన తరువాత చెడుగును చేసినప్పుడు పాపియగును. అతడు పావమును గూర్చిన మనస్సాక్షిని కలిగినవాడు పాపియగును. అతడు పావమును గూర్చిన మనస్సాక్షిని కలిగినవాడు గనుక రక్షణ అతనికి అవసరం. పాపము వలన పర్యవసానములనేకములను స్త్రీ పురుషులు ఎదుర్కొనవలసినదే. చివరిగా భౌతిక మరణం పాప ఫలితమే.

ఆదాము హవ్వలు, అటు తరువాత ఉద్భవించిన మానవులందరు వారి వారి పాపములను గూర్చియే లెక్క చెప్పవలసియుండును గాని యితరుల పాపమును గూర్చి కాదు, మనము యేసుప్రభువును ఆయన వాక్యమును నిరాకరించిన యెడల అంత్య దినమందు మనకు తీర్పు తీర్చువాడొకడు కలడు. అది ఆయన వాక్యమే (యోహాను 12:48). ఆ ఆఖరి తీర్పులో కూడా ప్రతివాడు మరొకని పాపముల కొరకు కాదు గాని తన పాపములకే దేవునికి జవాబు చెప్పవలసియున్నది. " తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి.... వారిలో ప్రతివాడు తన క్రియల చొప్పున తీర్పుపొందెను" (ప్రకటన 20o12,13). " ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరము క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5:10).

–జె.సి. ఛోట్.

పిల్లలకు కూల్ డ్రింక్సు, నోటు పుస్తకములు, పెన్నులు, పెన్సిళ్ళు, కంపాస్ బాక్సులు బహుమతిగా ఇయ్యబడెను. స్థానిక సువార్తికులు కోనాల దేవిడ్ రాజుగారు పిల్లలను, పెద్దలను ప్రోత్సహించి ప్రభువులోనికి నడుపుచున్నారు.

2010 ఏప్రియల్ 20,21,22 తేదీలలో రిక్కీగూటం గారు సింగపూర్‌లో జూరాంగ్ క్రీస్తు సంఘముతోను, Four Seas Bible College తోను సమయము గడిపిరి. సోదరులు దేవిడ్‌చ్యూ, పీటర్ చిన్, ఎడ్డీయీలను కలసికొని సింగపూర్‌లో జరుగుచున్న పనిని గూర్చి తెలిసికొనిరి . ఏప్రియల్ 25న ఆస్ట్రేలియాలో మెల్బోర్న్ క్రీస్తు సంఘముతో రిక్కీగారుండిరి. ఏప్రియల్ 27 నుండి మే 3వ తేదీ వరకు రిక్కీగూటం గారు Eastern Shore Bible Lectureship లో యుండి ఉపన్యసించిరి. ఆ లెక్చరర్‌షిప్‌కుU.S.A న్యూజిలాండ్, ఆఫ్రికా, ఆస్ట్రేలియాల నుండి. ఉపన్యాసకులు హాజరైరి. టాస్మేనియాలోని Hobart పట్టణంలో యున్న East Shore క్రీస్తు సంఘము ఆ లెక్చరర్‌షిప్‌ను నిర్వహించిరి. రిక్కీగారు మరల మే 9వ తేదీనాడు మెల్బోర్న్ పట్టణం East Side క్రీస్తు సంఘములో వాక్య పరిచర్య చేసిరి.

2010 మే నెల 4,5,6, తేదీలలో రామచంద్రపురం అగ్రహారంలో యున్న క్రీస్తు సంఘము సువార్త కూటములు నిర్వహించిరి. స్థానిక సువార్తికులగు పి. సుందర్రావు గారు ప్రభువునందు నిద్రించిన కొద్ది వారములలోనే అగ్రహారం క్రీస్తు సంఘము ఈ కూటములు నిర్వహించుట అభినందనీయము. సోదరులు యమ్. విజయకుమార్ (బిక్కవోలు), యమ్. మణికుమార్ (యానాం), టి. ప్రసన్న కుమార్, పి.డి.బిషప్, కె.జి. కుమార్, కె.వి. ప్రసాద్ గార్లు వాక్య పరిచర్య చేసిరి. కూటముల అనంతరం నలుగురు యౌవనస్థులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సుందర్రావు గారు ప్రారంభించిన దేవుని గొప్ప పనిని ఆయన సతీమణి విజయ ఆశీర్వాదం గారి ప్రార్థన, ప్రోత్సహములవలన అగ్రహారం, ఓదూరు సంఘములు బలముగా ముందుకు సాగుచున్నవి.

# మీకొక గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును . గాని మీరు 85/- రూ॥లు మాత్రమే. మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిలు విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి:


***Satya Vani***

**#7-9-35, Sambamurty Street,**

**Kakinada - 533 004. Ph: 0884- 2363722**



**RNI Regd. No. 6997/98**
**Postal Regd. No. AP/KD-02/2009-2011**


**To**

From:


**SATYA VAKKU**

**P.O. Box 80, Kakinada - 533 001**



Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurty St. Kakinada - 533 004